క్లుప్తంగా

30 వరకూ ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు

నల్లజర్ల: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఫెయిలైన ప్రైవేట్ అభ్యర్థులు పరీక్ష ఫీజు చెల్లింపునకు సెప్టెంబరు 30 వరకూ గడువు ఉందని నల్లజర్ల లోని ఎస్ఆర్‌కే కళాశాల ప్రిన్సిపాల్ కండెపు సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించుకుని గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

చురుగ్గా గ్రావెల్ రోడ్ల నిర్మాణం



తాడిమళ్లలో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, నాయకులు

నిడదవోలు రూరల్: మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో చేపట్టిన గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తాడిమళ్ల గ్రామంలో వైఎస్సార్ జగనన్న కాలనీకి వెళ్లేందుకు రూ.6 లక్షలు, ఎన్టీఆర్ కాలనీలో రూ.3 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్లను మంగళవారం ఆమె పరిశీలించారు. రోడ్ల పనులు నాణ్యంగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. తాడిమళ్ల ఉప సర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, సొసైటీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, నాయకుడు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీగా సింహాద్రి



నల్లజర్ల: కొంత కాలంగా మండలంలో ఖాళీగా ఉన్న ఈఓపీఆర్డీ పోస్టు భర్తీ అయ్యింది. పీఎస్ఎస్ సింహాద్రి ఈఓపీఆర్డీగా నియమితులయ్యారు. భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పీఎస్ఎస్ సింహాద్రి పదోన్నతిపై ఇక్కడ ఈఓపీఆర్డీగా బాధ్యతలు చేపట్టారు.

ఉండ్రాజవరంలో 'నా భూమి - నాదేశం' ర్యాలీ



ఉండ్రాజవరంలో ర్యాలీ చేస్తున్న హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఉండ్రాజవరం హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం నాభూమి, నాదేశం ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం వారణాశి విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలు, దేశ నాయకుల చిత్రపటాలను పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. అంతేగాకుండా విద్యార్థులు తాము సేకరించిన మట్టిని చేతులతో పట్టుకుని 'మేరీ మాటీ, మేరా దేశ్' అంటూ నినాదాలు చేస్తూ దేశ భక్తిని చాటారు.

రెయిన్ కోట్స్ పంపిణీ



రెయిన్ కోట్స్ పంపిణీ చేసిన రంగా వెంకటేశ్వరరావు, లయన్స్ సభ్యులు

నిడదవోలు: పట్టణంలోని చిరు వ్యాపారులకు లయన్స్ క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. లయన్ రంగా వెంకటేశ్వరావు ఆర్థిక సహకారంతో స్థానిక లయన్స్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణ, పూసరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మహారాణులు

- చట్టసభల్లో స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్లు
- పార్లమెంట్‌లో బిల్లు ఆమోదంపై హర్షం
- నియోజవర్గంలో మహిళలకు అధిక ప్రాధాన్యం



నిడదవోలు: చట్టసభల్లో మహిళలకు అగ్రతాంబూలం దక్కనుంది. ఇకపై చట్టాల రూపకల్పనలో వారే కీలకం కానున్నారు. వారికి 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రవేశపెట్టిన బిల్లు ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందడం శుభ పరిణామం. దీని ఫలితంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. అదేవిధంగా దేశాభివృద్ధి, రాజకీయాల్లో మహిళలు కూడా కీలకపాత్ర పోషించడానికి అవకాశం కలుగుతుంది. లింగ విభేదాలకు చరమ గీతం పాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 33 శాతానికి మించి మహిళలకు సీట్లు కేటాయించింది. ఇక నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకే కేటాయించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కింది. రాబోయే రోజుల్లో చట్టసభల్లో ఏ బిల్లు చట్టరూపం దాల్చాలన్నా మహిళల 33 శాతం ఓట్లే కీలకం అవుతాయి.

నియోజకవర్గంలో మహిళా ప్రజాప్రతినిధుల వివరాలు

మొత్తం ఓటర్లు	2,08,062
మహిళా ఓటర్లు	1,06,131
మొత్తం సర్పంచులు	56
మహిళా సర్పంచులు	26
మొత్తం ఎంపీటీసీలు	62
మహిళా ఎంపీటీసీలు	26
ఒక మహిళా జెడ్పీటీసీ	
మొత్తం కౌన్సిలర్లు (నిడదవోలు మున్సిపాలిటీ)	28
మహిళా కౌన్సిలర్లు (63 శాతం)	17
వైస్ చైర్‌పర్సన్ (మహిళకే)	

వైఎస్సార్ సీపీలో మహిళలకు సముచిత స్థానం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజకీయంగా మహిళలకు సముచిత స్థానాన్ని కల్పించారు. ఇప్పటికే నామినేటెడ్ పదవుల్లో సగం పదవులు దక్కాయి. ఈ ప్రభుత్వం మహిళలకు రాజకీయాల్లో ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. చట్ట సభల్లో 33 శాతం అవకాశం మహిళలు కల్పించడంతో రాజకీయంగా దూసుకుపోవడం ఖాయం. బీసీ రిజర్వేషన్‌తో ప్రస్తుతం నేను ఎంపీపీ పదవిలో ఉన్నాను.

– పొలాటి ఎల్లారీశ్వరి, ఎంపీపీ, ఉండ్రాజవరం మండలం

రాజకీయాల్లో మార్పులకు నాంది



భవిష్యత్తులో దేశ రాజకీయాలను శాసించే అవకాశం కల్పించారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. అన్ని రంగాల్లోనూ ఇప్పటికే మహిళలు ముందంజలో ఉన్నారు. భవిష్యత్తు రాజకీయాల్లో పెను మార్పులకు ఇది నాంది పలుకుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు నెరవేరతాయి.

– కాలాబత్తుల సుజాత, జిల్లా సమైక్య అధ్యక్షురాలు

ఇది చారిత్రక ఘట్టం



ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న మహిళా బిల్లుకు మోక్షం లభించడం ఆనందంగా ఉంది. మోదీ ప్రభుత్వం కొత్త పార్లమెంట్ భవనంలో మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం పొందడం మహిళలకు శుభవార్త. మహిళలకు మరో చారిత్రాత్మక ఘట్టం ఇది. నిడదవోలు మున్సిపాలిటీలో 28 మంది కౌన్సిలర్లకు గాను ఏకంగా 17 మంది మహిళలకు కౌన్సిలర్లుగా అవకాశం లభించింది.

–కొత్తపల్లి సుప్రియ, కౌన్సిలర్, నిడదవోలు మున్సిపాలిటీ

అన్నింటా రాణిస్తారు



ఇప్పటికే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడంతో రాజకీయాల్లో మహిళల పాత్ర ఎంతో కీలకం కానుంది. తమ కుటుంబాలను మహిళలు ఎలా నిలబెట్టుకుంటారో అదేవిధంగా మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరు. మహిళా బిల్లుతో రాజకీయాల్లో మహిళలు చక్రం తిప్పడం కాయం. నిడదవోలు మున్సిపాలిటీలో మహిళా మైనార్టీలకు ఎంతో అవకావం కల్పించారు.

–ఎండీ షకీరాబేగం, కౌన్సిలర్, నిడదవోలు మున్సిపాలిటీ

30 నుంచి ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

నిడదవోలు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామ సచివాలయ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ మంగళవారం తెలిపారు. ఈనెల 30న విజ్జేశ్వరం, ఆక్టోబర్ 3న గోపవరం, 4న పురుషోత్తపల్లి, 5న సమిశ్రగూడెం-2, 6న అట్లపాడు, 7న మునిపల్లి, 10న పెండ్యాల, 11న కోరుపల్లి, 12న పందలపర్రు, 13న డి.ముప్పవరం, 17న కోరుమామిడి-1, 18న కోరుమామిడి-2, 19న తాడిమళ్ల-2, 20న కాటకోటేశ్వరం, 21న తిమ్మరాజుపాలెం, 27న కంసాలిపాలెం, 28న రావిమెట్ల, 31న సింగవరం, నవంబర్ 1న తాళ్లపాలెం, 2న శెట్టిపేట గ్రామాల్లో వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఈ వైద్యశిబిరాలు జరుగుతాయన్నారు. ప్రజలంతా వైద్యసేవలు పొందాలని ఆయన కోరారు.

పోక్సో చట్టం కింద కేసు నమోదు

సీతానగరం: నిడదవోలు మండలం గోపవరానికి చెందిన 31 ఏళ్ల ఛామకుర్తి సుధాకర్‌పై పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, బాల్య వివాహ నిరోధక చట్టాల ప్రకారం కేసులు నమోదు చేశామని ఎస్సై కె. చిరంజీవి మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వెదుళ్లపల్లికి చెందిన బాలిక అదే గ్రామంలోని హైస్కూల్లో పదో తరగతి చదివింది. ఆ సమయంలో గోపవరం నుంచి వచ్చిన సుధాకర్ హైస్కూల్లో భవన నిర్మాణ పనులు చేసేవాడు. ఆ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న ఆ బాలిక సుధాకర్ వద్దకు వెళ్లగా, ఈనెల 23న గౌరీపట్నంలో వివాహం చేసుకున్నాడు. అయితే తన కుమార్తె కనిపించడం లేదంటూ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. ఆ బాలికను అదుపులోకి తీసుకుని విచారించగా పైవిషయాలు తెలిపింది. ఈ కేసును డీఎస్పీ దర్యాప్తు చేస్తారని ఎస్సై చిరంజీవి వివరించారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ



పురుషోత్తపల్లి ఆర్‌బీకే వద్ద ఎలుకల నివారణ మందు అందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నిడదవోలు రూరల్: రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం, పందలపర్రు, రావిమెట్ల, పురుషోత్తపల్లి, తాడిమళ్ల గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు మంగళవారం వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఉచితంగా నూకలతో కలిపిన బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాల్దారి శ్రీను, తిరుమళ్ల దుర్గారావు, కటికిరెడ్డి నారాయణరావు స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: సామూహిక ఎలుకల నివారణలో భాగంగా మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద మంగళవారం ఆయా పంచాయతీల సర్పంచుల చేతుల మీదుగా రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి ఎం.వి శ్వాసరావు మాట్లాడుతూ ప్రతి రైతూ తాము అందించిన ఎలుకల నివారణ మందును, నూనె, వరి నూకతో కలిపి చిన్న చిన్న పొట్లాలుగా చేసుకోవాలన్నారు. ప్రతి రైతూ వాటిని తమ పొలాల గట్ల ఎలుకల కన్నాల వద్ద ఉంచాలన్నారు. ఈ మందును ఒకేసారి అందరు రైతులూ సామూహికంగా పెట్టడం వలన ఎలుకల నిర్మూలన జరుగుతుందన్నారు.

గృహ సారథులకు బీమా సదుపాయం



దొండపూడిలో గృహ సారథులతో మాట్లాడుతున్న తానింకి సత్యనారాయణ

గోపాలపురం: గృహ సారథులకు వైఎస్సార్ బీమా సదుపాయం కల్పిస్తున్నట్టు మండల సచివాలయ కన్వీనర్ తానింకి సత్యనారాయణ అన్నారు. వైఎస్సార్ బీమాపై మండలంలోని దొండపూడి, రాజంపాలెం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు గ్రామాల్లో మంగళవారం గృహ సారథులకు ఆయన అవగాహన కల్పించారు. ఆ నాలుగు గ్రామాల్లోని సచివాలయాల వద్ద ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా తానింకి సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే 80 శాతం మందికి బీమా కల్పించామన్నారు. తమ సచివాలయం పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి గృహ సారథులు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, సర్పంచులు కురుకూరి ధనలక్ష్మి, మడిచర్ల ప్రసాద్, మల్లిపూడి అచ్చిబాబు, చిలకా లక్ష్మణస్వామి ఎంపీటీసీ సభ్యులు గృహ సారథులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిమజ్జనాల సందడి

- వినాయక విగ్రహాల ఊరేగింపులు
- బైబై గణేశా నినాదాలు
- బ్యాండ్ మేళాలు, శక్తి వేషాల కోలాహలం



తాడిపర్రులో వాహనంపై ఊరేగుతున్న వినాయకుడు



అన్నవరప్పాడులో పల్లకీలో ప్రధాన వినాయకుడి ఊరేగింపు



పెరవలి మండలం తీపర్రులో శక్తి వేషాలు



నిడదవోలు ఎన్టీఆర్ కాలనీలో శివలింగ దీపార్చన

ఉండ్రాజవరం: గణపతి నవరాత్ర మహోత్సవాలు ముగింపునకు చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో ఏ గ్రామంలో చూసినా గణనాథుల ఊరేగింపులు, బైబై.. గణేశా అనే నినాదాలు, నిమజ్జనాల సందడి కనిపిస్తోంది. మండలంలోని తాడిపర్రులో ప్రతిష్ఠించిన సిద్ధి వినాయక స్వామివారి ఊరేగింపును మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఊరేగింపులో వీరభద్రుడి వేషాలు వేసుకున్న 40 మంది యువకులు దవడల్లో కత్తులు, సూదులు దింపుకుని రెండు ఎడ్ల బళ్లపై ఊరేగుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యాండ్ మేళాలు, కేరళ డప్పులు ఆకట్టుకున్నాయి. గొర్రె గేదెలు, బుట్ట బొమ్మల విన్యాసాలు కడుపుబ్బా నవ్వించాయి.

పెరవలి: మండలంలోని తీపర్రు గ్రామంలో మంగళవారం వినాయకుని ఊరేగింపు సందడిగా సాగింది. బ్యాండ్ మేళాలు, కరీంనగర్ డప్పులు, శక్తి వేషాలు, పౌరాణిక వేషాలు ఊరేగింపునకు ఆకర్షణగా నిలిచాయి. కంజెర డప్పులు, బ్యాండ్ మేళాల వద్ద అలరించే పాటలకు అనుగుణంగా యువకులు నృత్యాలు చేశారు. బాణసంచా కాల్పులతో గ్రామం మార్మోగింది. వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించిన వాహనంపై గణనాథుని ఊరేగింపు జరిగింది. ఊరేగింపును చూడడానికి పరిసర గ్రామాల నుంచి వందలాది మంది తరలి వచ్చారు. దాంతో వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

చాగల్లు: గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్థానిక తెలగా సంఘం కళావేదికపై సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు. అలాగే చాగల్లులోని వర్తక సంఘం కళావేదికపై అత్తిలికి చెందిన సత్య ఆర్కెస్ట్రా వారి సినీ సంగీత విభావరి జరిగింది. గాయనీ గాయకులు పాతవీ, కొత్తవీ అన్ని రకాల పాటలు పాడారు. ఆయా ఉత్సవ కమిటీలు నిర్వాహకులు గండ్రోతు సురేంద్ర కుమార్, గ్రంధి రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా బ్రాహ్మణగూడెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గల కాలనీలో అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లో మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. వేగేశ్వరపురం కాలువ వద్ద గల వినాయకుడి ఆలయం వద్ద సుమారు నాలుగు వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. తాళ్లపూడి బస్టాండ్ వద్ద లక్ష్మీగణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో సుమారు మూడు వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న శింగం శివను సత్కరించారు.

108 దీపాలతో శివలింగ దీపార్చన

నిడదవోలు: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వరసిద్ధి వినాయక యువ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చిన్నారులకు విద్యా గణపతి పూజ నిర్వహించారు. లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ వంటి ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. మంగళవారం రాత్రి మహిళలు 108 దీపాలతో చేసిన శివలింగ దీపార్చన ఆకట్టుకుంది.

బోర్డు అనుమతి మేరకే పొగాకు పండించాలి

- వేలం నిర్వహణాధికారి ప్రసాద్
- పల్లంట్ల గ్రామంలో రైతులకు సదస్సు



పొగాకు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్

దేవరపల్లి: పొగాకు బోర్డు అనుమతించిన మేరకే పొగాకును పండించి అంతర్జాతీయ మార్కెట్ సంక్షోభం నుంచి బయట పడాలని దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ రైతులకు సూచించారు. పొగాకు పంట నియంత్రణ ఆవశ్యకత, నారుమడుల్లో యాజమాన్యంపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పొగాకు బోర్డు ఆధ్వర్యంలో మండలంలోని పల్లంట్ల గ్రామంలో నిర్వహించిన సదస్సులో జీఎల్‌కే ప్రసాద్ మాట్లాడారు. అంతర్జాతీయంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, పొగాకు నిల్వలు, గిరాకీ వంటి అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకున్నాకే, పొగాకు బోర్డు పంట పరిమాణాన్ని నిర్ణయించినట్టు తెలిపారు. బ్యారన్‌కు 3,500 కిలోల ఉత్పత్తికి అనుమతి ఇచ్చినట్టు చెప్పారు. ఈ పరిమాణానికి మించి ఉత్పత్తి చేయవద్దని రైతులకు సూచించారు. ఎస్ఎల్ఎస్ ప్రాంతంలో ఈ ఏడాది పంట పరిమాణాన్ని 49.48 మిలియన్ల కిలోలుగా నిర్ణయించినట్టు ప్రసాద్ తెలిపారు. ఎస్ఎల్ఎస్ ప్రాంతంలో సీటీఆర్ఐ ఆమోదించిన ఎల్‌వీ-7, ఎఫ్‌సీటీ-11, కే 326 పొగాకు వంగడాలను మాత్రమే సాగు చేయాలని సూచించారు. అనధికార వంగడాలను సాగు చేస్తే పొగాకు బోర్డు చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఐటీసీ ప్రతినిధి చారువాక మాట్లాడుతూ ట్రేలలో నారు పెంచి ఆరోగ్యమైన నారును నాటుకోవాలన్నారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ వి.వెంకటేశ్వర్లు నారుమడుల్లో సస్యరక్షణ చర్యలను విశదీకరించారు. అనంతరం పొగాకు నారుమడులను పరిశీలించారు. ఈ సదస్సులో పీఎస్ఎస్ కంపెనీ ప్రతినిధి సీతారామరాజు, రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు రైల్వే గేట్ మూసివేత

ఉండ్రాజవరం: సత్యవాడ రైల్వే గేట్‌ను 3 రోజులు మూసివేస్తున్నట్టు మంగళవారం రైల్వే అధికారులు ప్రకటించారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో గేటును మూసివేస్తున్నందున వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలన్నారు. భీమవరం-నిడదవోలు మధ్య రైల్వే డబుల్ లైన్ మరమ్మతుల కోసం గేటును మూసివేశామని రైల్వే ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు.

సారా కేసులో జరిమానా

తాళ్లపూడి: సారా తయారీ, అమ్మకం కేసుల్లో దోషిగా తేలిన మండలంలోని తుపాకులగూడెంకు చెందిన శీలబోయిన ఈశ్వరరావుకు తహసీల్దార్ టి.రాధిక మంగళవారం రూ.10 వేల జరిమానా విధించారు. గతంలోనే ఈశ్వరరావుపై సారా తయారీ, అమ్మకం కేసు నమోదైందని కొవ్వూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. మళ్లీ ఇప్పుడు ఈశ్వరరావు అవే నేరాలకు పాల్పడుతుండడంతో తహసీల్దార్ కోర్టులో అతడిని బైండోవర్ చేశామన్నారు. దాంతో తహసీల్దార్ పై మేరకు జరిమానా విధించారన్నారు.

ప్రక్కిలంకలో పోషకాహార మహోత్సవాలు

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక సచివాలయం వద్ద మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను సీడీపీఓ మమ్మీ గర్భిణులకు, బాలింతలకు వివరించారు. ఆకుకూరలు, కాయకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ యాళ్ల బాబురావు, ఎంపీటీసీ సభ్యురాలు ఖండవల్లి సాయిపద్మ, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ భాగ్యకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైన్లకు భూమిపూజ



బ్రాహ్మణగూడెంలో రహదారికి భూమి పూజ చేస్తున్న నాయకులు

చాగల్లు: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య అన్నారు. బ్రాహ్మణగూడెం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గల కాలనీలో మండల పరిషత్ నిధులు రూ.6 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైన్లకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణగూడెం సర్పంచ్ గురువెల్లి కుమారి, ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ ప్రత్తిపాటి సుబ్బారావు, కేతనపల్లి సూర్యనారాయణ, పొన్నాడ సింహాద్రి, ఎల్లే వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో అంగన్‌వాడీల ధర్నా

కొవ్వూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బపోలీసుల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలను నిరసిస్తూ వారందరూ తొలుత స్థానిక బస్ స్టాండ్ సెంటర్ నుంచి విజయవిహార్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బి.నాగరాజు నాయక్‌కు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ, వి.శ్రీదేవి, ఎ. నరసమ్మ, సీహెచ్ బ్రహ్మయ్య, ఎస్ శాంతకుమారి, జక్కల మణి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు ఆర్డీవో ఎస్.మల్లిబాబును కలిసి వినతిపత్రం అందజేశారు.